సాక్షి తిరుపతి

బుధవారం । 11 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,710
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,155

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,700
రిటైల్ వెండి గ్రాము	రూ.71.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	16
చిత్తూరు	30	15
తిరుమల	26	12
గూడూరు	31	18
నగరి	31	17



సంకటహర చతుర్థి వ్రతం సందర్భంగా మంగళవారం రాత్రి కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి సిద్ధి, బుద్ధి సమేతంగా ఆలయ మాడ వీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. - కాణిపాకం

న్యూస్‌రీల్

14న మకరజ్యోతి దర్శనం



సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీన మకరజ్యోతి దర్శనం ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆనవాయితీ ప్రకారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసమేతంగా తిరు ఆభరణాలను స్వామివారికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయానికి తూర్పు దిక్కులోని కొండపై నుంచి మకరజ్యోతి దర్శనమిస్తుందని వివరించారు. జ్యోతిని దర్శించుకునేందుక పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 12 నుంచి 18వ తేదీ వరకు సెలవులు ఉంటాయన్నారు. ఈ సమయంలో తరగతులు నిర్వహించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: సంక్రాంతికి ఆర్టీసీలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డీపీటీవో చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. వాటిలోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తామన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడకు అదనపు బస్సులను ఏర్పాటు చేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడుపుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా తిరుపతి నుంచి తిరుమల కొండకు మరో 9 విద్యుత్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం తిరుమలకు 19 విద్యుత్ బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. త్వరలో మరో 80 విద్యుత్ బస్సులు అలిపిరి డిపో కేంద్రంగా నడపనున్నట్లు వివరించారు.

15న ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల: వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత ఏడాది డిసెంబరు 22న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు ఈ నెల 15వ తేదీన ముగియనున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీ వైష్ణవ జీయంగార్లు ప్రతి రోజూ రంగనాయకుల మండపంలో గోష్ఠిగానం ద్వారా స్వామివారికి నివేదిస్తున్నారు. అధ్యయనోత్సవాల్లో తొలి 11 రోజులను పగల్‌పత్తు అని, మిగిలిన 10 రోజులను రాపత్తు అని వ్యవహరిస్తారు. 22వ రోజున కణ్ణినున్‌శిరుత్తాంబు, 23వ రోజున రామానుజ నూత్రందాది, 24వ రోజున శ్రీ వరాహ స్వామివారి సాత్తుమొర, 25వ రోజున తణ్ణీరముదు ఉత్సవంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.

28న తిరుచానూరులో రథ సప్తమి వేడుకలు

తిరుచానూరు: పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 28వ తేదీన రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. రథ సప్తమి సందర్భంగా అమ్మవారు ఏడు ప్రధాన వాహనాల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. రథ సప్తమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవం, సామవేద పుష్పాంజలి, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు ఆరో విడత జగనన్న తోడు

తిరుపతి అర్బన్: జగనన్న తోడు పథకం ద్వారా చిరువ్యాపారాలు, చేతివృత్తుల వారికి 6వ విడత వడ్డీ రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెట్టుబడి నిమిత్తం బ్యాంకుల నుంచి రుణం తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో 34,243 మంది చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారికి రూ.34.24 కోట్లు రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. వారికి వడ్డీ కింద ప్రభుత్వం రూ.78,66,685 చెల్లించనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్‌లోనూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ట్యాబ్ పాఠం.. విద్యా వికాసం

- మెరుగైన విద్యా ప్రమాణానికి డిజిటల్ విద్య
- 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు అందజేత



తిరుపతి ఎడ్యుకేషన్: పిల్లలకు మనం అందించే ఆస్తి విద్య. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేద పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని భావించారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దారు. తల్లులపై ఆర్థిక భారం తగ్గించేందుకు అమ్మఒడి, విద్యాదీవెన, విద్యా కానుక వంటి పథకాలను అమలుచేస్తున్నారు. నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలుచేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అందులో భాగంగానే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యం మెరుగుపరిచేలా వినూత్న కార్యక్రమాలు, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

బైజూస్‌తో ఒప్పందం

నేడు టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. విద్యారంగంలోకీ విస్తరించింది. నల్లబోర్డులు మాయమై డిజిటల్ బోర్డులు వచ్చేశాయి. డిజిటల్ విద్యాబోధనతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగవుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. విద్యార్థులకు డిజిటల్ తరగతులు అందించాలని భావించింది. ఆన్‌లైన్ విద్యారంగ దిగ్గజం బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.కోట్లు వెచ్చించి శాంసంగ్ ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్‌ను ఇంగ్లిష్, తెలుగులో నిక్షిప్తం చేసింది. ఒక్కో ట్యాబు ధర రూ.32 వేల చొప్పున తిరుపతి జిల్లాకు రూ.68.55 కోట్లు వెచ్చించి 21,422 ట్యాబ్‌లను 8వ విద్యార్థులు, టీచర్లకు అందజేసింది. ఇంటర్నెట్‌తో పనిలేకుండా ఇందులోని పాఠ్యాంశాలను చూడవచ్చు.

ట్యాబ్‌లో పాఠాలు

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లో 8, 9 తరగతులకు సంబంధించిన గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలు, చరిత్ర, భూగర్భ, పౌర శాస్త్రాల సబ్జెక్టుల పాఠాలు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఉన్నాయి. పాఠశాలల్లో అనుసరించే పాఠ్యపుస్తకాల్లో అధ్యాయాల వారీగా కంటెంట్ ఇండెక్స్‌ను పొందుపరిచారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించి ప్రతి కాన్సెప్ట్‌ను 2 నుంచి 4 నిమిషాల వ్యవధితో వీడియోలుగా రూపొందించారు. మొత్తం 300 వీడియోలతో పాటు 57 అధ్యాయాలు, 472 కాన్సెప్టులు ఉన్నాయి.

ప్రశ్న పత్రాలు

ఆయా సబ్జెక్టులకు సంబంధించి సుమారు 168 ప్రశ్న పత్రాలు ఇందులో ఉన్నాయి. విద్యార్థులు పాఠ్యాంశాలను వీడియో ద్వారా చూసి నేర్చుకోవడంతో పాటు ప్రశ్న పత్రాల ద్వారా తమను తాము పరీక్షించుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా అభ్యసనా సామర్థ్యాన్ని ఎవరికి వారే పెంపొందించుకోవడానికి దోహదపడుతుంది.

ఎప్పుడైనా.. ఎక్కడైనా

తెలియని అంశాలు, సందేహాలను తరగతి గదిలో ఒకట్రెండు సార్లు మాత్రమే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునే అవకాశం ఉంటుంది. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు తమ సందేహాలను ఎప్పుడైనా.. ఎక్కడైనా నివృత్తి చేసుకోవచ్చు. తద్వారా వెనుకబడిన విద్యార్థులు సైతం చదువులో రాణించేందుకు మార్గం సుగమం అవుతుందని విద్యావేత్తలు పేర్కొనడం విశేషం.

త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ

బైజూస్ కంటెంట్‌పై సబ్జెక్టు టీచర్లకు సంక్రాంతి సెలవులు తరువాత శిక్షణ ఇవ్వనున్నారు. కంటెంట్‌కు సంబంధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ముందస్తుగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు.

తిరుపతి జిల్లా వివరాలు

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు	433
8వ తరగతి విద్యార్థుల సంఖ్య	18,829
8వ తరగతి ఉపాధ్యాయుల సంఖ్య	2,593
మొత్తం ట్యాబులు	21,422
ట్యాబుల విలువ	రూ.68.55 కోట్లు

ట్యాబ్‌ల పంపిణీ హర్షణీయం



విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు విద్యార్థుల ఉజ్వల భవితకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఇప్పటికే సమూల మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్‌కు మించి నాణ్యమైన విద్య నందిస్తోంది. తాజాగా రూ.కోట్లు వెచ్చించి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించడం హర్షణీయం.

– డాక్టర్ కె.వెంకటరమణ, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

మెరుగైన అభ్యసనా సామర్థ్యం



ట్యాబ్‌లతో విద్యార్థుల్లో మెరుగైన అభ్యసనా సామర్థ్యం పెరుగుతుంది. తరగతిలో చెప్పిన పాఠాలను మననం చేసుకోవడానికి, తెలియని అంశాలను పలుమార్లు ఇంట్లోనే చూసి నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. సైన్సు సంబంధించిన డయాగ్రామ్‌లను అంశాల వారీగా విభజించారు.

– డి.ద్వారకనాథ్‌రెడ్డి, బయాలజీ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, బందారుపల్లి

గణితంపై పట్టు



సాధారణంగా పిల్లలకు గణితం అంటే కొంత భయం ఉంటుంది. ఎంత చదివినా సూత్రాలు, ఫార్ములాలు మరిచి పోతుంటారు. అలాంటి వారికి ట్యాబ్‌లోని కంటెంట్ బాగా ఉపయోగపడుతుంది. సులువైన పద్ధతిలో ఉండడంతో తెలివైన పిల్లలు మంచి స్కోరు చేస్తారు. వెనుకబడిన వారు రాణిస్తారు.

– సి.రాంబత్తయ్య, గణితం ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, బందారుపల్లి

చాలా సులువుగా ఉంది



టీచర్లు చెప్పే పాఠాలతో పాటు ట్యాబ్ ద్వారా ఇంటి వద్ద పాఠాలను చదువుతున్నాను. ట్యాబ్‌లోని పాఠాలు ఇంగ్లిష్, తెలుగు రెండింటిలోనూ ఉన్నాయి. గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలు, చరిత్ర, భూగర్భ, పౌర శాస్త్రాల సబ్జెక్టులు విడివిడిగా పూర్తి సమాచారంతో ఉండడంతో సులువుగా నేర్చుకోవచ్చు.

– ఆర్.నందిని, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, బందారుపల్లి

చదువుపై ధ్యాస పెరిగింది



మా అబ్బాయి వై.సతీష్ బండారుపల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇదివరకు స్కూలు నుంచి వచ్చిన వెంటనే ఆడుకునేవాడు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌తోనే గడుపుతున్నాడు. పాఠాలను చదువుకుంటున్నాడు. చదువుపై ధ్యాస పెరిగింది. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు.

– వై.సుబ్బమ్మ, విద్యార్థి తల్లి, బందారుపల్లి

పేదల అభ్యున్నతికే ప్రాధాన్యం

- సుపరిపాలనకే సచివాలయాలు
- ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం: నడిగడ్డలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

సదుం: పేదల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం బూరగమంద, మొరవపల్లె, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ పంచాయతీల్లో పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కార్యాచరణ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే ధ్యేయంతోనే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారని వెల్లడించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక సాయంతోపాటు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తల్లీబిడ్డల సంరక్షణలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రమే మారిపోతున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

సదుం మండలంలోని మొరవమీదపల్లె, దిన్నెవడ్డిపల్లె, గాదేవారిపల్లెకు చెందిన 29 మంది టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, డీపీఓ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, వైఎస్సార్‌సీపీ నేత వల్లివేడు పృథ్వీరెడ్డి పాల్గొన్నారు.

‘డైట్’లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో భోనాలు వండుతున్న ఛాత్రోపాధ్యాయులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణలో రంగవల్లులను తీర్చిదిద్దారు. సంప్రదాయ వంటకాలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గొబిళ్లు, కోలాటాలు, కర్రసాము, నాలుగు స్తంభాలాట, బొంగరాలు, వైకుంఠపాళి తదితర ఆటలతో ఆకట్టుకున్నారు. భోగి మంట వేసి, గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరామ్ పురుషోత్తం, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, అధ్యాపకులు ప్రభాకర్, నిర్మల, దేవప్రసాద్, మహమ్మద్‌రఫీ, శ్రీనివాసులురెడ్డి, నగరాజు నాయక్, రెడ్డి వెంకటరమణ, అనిత, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





భోగిమంటలు వేస్తున్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు (ఇన్‌సెట్) వైకుంఠ పాళి ఆడుతున్న ఛాత్రోపాధ్యాయులు

శ్రీకాళహస్తి కోవాకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తాం



పాడిరైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పాలకోవాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ యార్డులో పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీటీడీతో పాటు ప్రముఖ ఆలయాల్లో శ్రీకాళహస్తి పాలకోవా స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. పాల సరఫరా సంఘం తరపున పాడిరైతులకు ఆవుల కొనుగోలుకు రుణాలు అందజేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అమూల్ కంపెనీని రాష్ట్రానికి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రావు, సభ్యులు హరినాథ్, మంగమ్మ, రామయ్య, రామమూర్తి, మునికృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రమణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, మోహన్ నాయుడు, కందాటి ఈశ్వర్‌రెడ్డి, భక్తవత్సలనాయుడు, వడ్లతాంగల్ బాలాజీప్రసాదరెడ్డి, చింతామణి పాండు, మునిరామయ్య, శంకర్‌రెడ్డి, పఠాన్ ఫరీద్, గంగిరెడ్డి, పసల కృష్ణయ్య, ఈగల హరిరాయల్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు



ఊరందూరు జగనన్న కాలనీని పరిశీలిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్

శ్రీకాళహస్తి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టి ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఆదేశించారు. ఆయన మంగళవారం శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జగనన్న కాలనీని తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఐదు లక్షల ఇళ్లను ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో 24 వేల మంది లబ్ధిదారులు ఒకేసారి ప్రవేశాలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఊరందూరు లేఅవుట్‌లో 6,231 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా 4,873 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జిల్లా హౌసింగ్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు తొమ్మిది వేల ఇళ్ల ప్రారంభానికి సిద్ధమైనట్టు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, ఈఈ చంద్రశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్, ఎంపీడీవో ప్రేమకుమార్, విద్యుత్ శాఖ ఏఈ రాజేష్, హౌసింగ్ ఏఈ ఆలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్లు స్రవంతి, జయంతి

తిరుపతి మంగళం : క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని మంగళం పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం 15 మంది క్షయవ్యాధిగ్రస్తులకు డాక్టర్లు స్రవంతి, జయంతి పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న 15 మంది పేషంట్లను మిక్షయమిత్ర ద్వారా మంగళం పీహెచ్‌సీ నుంచి తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. వారికి ప్రతి నెలా ప్రభుత్వం అందించే మందులతో పాటు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే వారు మరింత ఆరోగ్యంగా ఉండేందుకు పప్పు దినుసులతో పాటు ఇతర వస్తువులను అందజేసినట్టు పేర్కొన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి

- హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు
- ముంగిట ముగ్గులు..గొబ్బెమ్మల సొబగులు
- కొండ ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం



సిద్ధేశ్వర కొండపై దీపపు ప్రదేశం



కొండ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు (ఫైల్)



అందంగా రూపుదిద్దుకుంటున్న సిద్ధేశ్వర కొండ ముఖద్వారం

పెళ్లకూరు: హరిదాసు కీర్తనలు.. సన్నాయి స్వరాలు.. డోలు వాయిద్యాలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలు, కొత్త అల్లుళ్లు, ఆడబిడ్డలు, బంధువులతో పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పెద్ద పండుగ కావడంతో ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో తమిళ, తెలుగు సంస్కృతులు ఉట్టిపడుతున్నాయి. ఇళ్లకు కొత్తగా రంగులు వేసి సంక్రాతి పండుగకు ముస్తాబు చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న పిల్లలు, ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

కొండ ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రాచీన సంప్రదాయాలు మరుగున పడుతున్నాయి. మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో నేటికీ సిద్ధేశ్వర, భూపతీశ్వర స్వామి ఉత్సవాలు కొనసాగిస్తున్నారు. ప్రతియేటా సంక్రాంతి సందర్భంగా సిద్ధేశ్వరస్వామి, భూపతీశ్వరస్వామి ఉత్సవాలను మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. శిరసనంబేడు కొండకు మధ్య భాగంలో సిద్ధేశ్వరుని రాతి విగ్రహంతో పాటు గ్రామంలోని ఓపూరిపాకలో స్వామివారి పంచలోహ విగ్రహాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.

మూడు రోజులు ఉత్సవాలు

పూర్వం పెళ్లకూరు ప్రాంతం శ్రీకాళహస్తి ప్రాంతాన్ని పరిపాలించే రాజు ఆధీనంలో ఉండేది. ప్రజలు చెల్లించే శిస్తును గ్రామ పెద్దలు దోపిడీ దారులను తప్పించుకుని రహస్య మార్గాల్లో తీసుకెళ్లి రాజులకు అందజేసేవారు. అలాగే రాజుల అనుమతితో గ్రామస్తులంతా కలిసి కొంత నగదు పోగుచేసి స్వామి వారి ఉత్సవాలు నిర్వహించేవారని పెద్దలు చెబుతున్నారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆలయం నుంచి కొండ చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ పొలిమేర కొండ దిగువన నిలుపుతారు. అక్కడ మూడు రోజులు స్వామిని ఉంచి పూజలు చేస్తారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. కొండ శిఖరంపై ఉన్న దీపాన్ని దర్శించుకుంటే కోర్కెలు తీరుతాయని ఇక్కడి వారి నమ్మకం. దీంతో ఎక్కువ మంది యువతీ, యువకులు కొండను ఎక్కేందుకు పోటీపడతారు. అలాగే రోసనూరు గ్రామంలోని భూపతీశ్వరస్వామి కొండపైనా ప్రతియేటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడు రోజులు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇటీవల సిద్ధేశ్వర కొండపై సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించారు. అలాగే భూపతీశ్వర స్వామి దర్శనం కోసం కొండపైకి మెట్లు ఏర్పాటు చేశారు.

దూరపు బంధువులు ఒక్కటయ్యే వేళ

ప్రతియేటా నిర్వహించే సిద్ధేశ్వర స్వామి, భూపతీశ్వర స్వామి ఉత్సవాలకు వివిధ గ్రామాల భక్తులతో పాటు రోసనూరు, శిరసనంబేడు గ్రామాలకు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. అలాగే ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, దూరపు బంధువులు కూడా కచ్చితంగా ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. బంధువుల రాకతో ప్రతి ఇల్లూ కళకళలాడుతుంది.



ముగ్గు వేస్తున్న మహిళ



గంగిరెద్దు



భిక్షాటన చేస్తున్న బుడబుక్కలు, దేవర వేషాలు

చాలా ఆనందంగా ఉంటుంది



సిద్ధేశ్వరస్వామి, భూపతీశ్వరస్వామి కొండ ఉత్సవాలకు దూరప్రాంతాల్లో ఉన్న బంధువులంతా వస్తారు. గ్రామాల్లో సందడి నెలకొంటుంది. ప్రతి ఇల్లూ కళకళలాడుతూ ఆనందంగా గడుపుతారు. ఉత్సవాల నిర్వహణలో గ్రామస్తులంతా తమవంతు సహాయం అందిస్తారు.

- చిరంజీవి, రోసనూరు

కోర్కెలు నెరవేరుతాయి



సంక్రాంతి పర్వదినాన సిద్ధేశ్వరకొండపై ఉన్న జ్యోతిని దర్శించుకోవడం వల్ల కోర్కెలు తీరుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. అందువల్ల అవివాహితులైన యువతీ, యువకులు కొండ శిఖరంపై ఉన్న దీపాన్ని దర్శించుకుంటారు. కోర్కెలు తీరిన వారు మళ్లీ కొండకు వెళ్లి స్వామిని దర్శించుకుంటారు.

- గోపాలయ్య, శిరసనంబేడు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన ఇంద్రానమ్మ

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం గ్రామం వద్ద మంగళవారం తెల్ల వారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. రాజగోపాలపురానికి చెందిన సుబ్రమణ్యంశెట్టి భార్య ఇంద్రానమ్మ(75) మంగళవారం ఉదయం కాలకృత్యాల కోసం పొలాల సమీపానికి వెళ్లి తిరిగి వస్తూ నారాయణస్వామి కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్వారీకి వెళ్లే టిప్పర్లే ఆమెను ఢీకొని ఉంటాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అమ్మవారి విగ్రహం లభ్యం




శ్రీహరికోట అటవీప్రాంతంలో బయటపడిన అమ్మవారి విగ్రహం

సూళ్లూరుపేట: శ్రీహరికోట రాకెట్ కేంద్రం అటవీ ప్రాంతంలో మంగళవారం అమ్మవారి విగ్రహం లభ్యమైంది. చల్లా యానాదులు కొంత మంది ఎప్పటి లాగే షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదిక, టెలీమీటర్ రోడ్డు సమీపంలోకి కట్టెల కోసం వెళ్లారు. అక్కడ అమ్మవారి రూపంలో పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్న విగ్రహం కంటపడింది. వారు వెంటనే రెండో ప్రయోగవేదికకు సమీపంలో ఉన్న వ్యాస్ట్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వెంకట్రామన్ బృందానికి తెలియజేశారు. వారు అటవీ ప్రాంతంలోకి వెళ్లి విగ్రహాన్ని పరిశీలించారు. శూలం ధరించిన అమ్మవారు శక్తి స్వరూపిణి ఆసనంలో కూర్చుని ఉండడం గమనించి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడే అమ్మవారికి చిన్న పాటి ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు. ఇదిలావుండగా శ్రీహరికోట దీవి ప్రాంతం అటు బంగాళాఖాతానికి, ఇటు పులికాట్ సరస్సుకు మధ్యలో విస్తరించి ఉంది. శ్రీహరికోట దీవి అరకోటి లింగాలతో నిండిన కోటగా శ్రీహరకోటగా ఉండేదని, కాలక్రమేణా ఇది శ్రీహరికోటగా మారిందని చెబుతుంటారు. స్థానికంగా చోళరాజులు నిర్మించిన ఆలయాలు ఎన్నో ఉన్నాయని, నాడు ఇక్కడ ఉన్న ఆలయాల్లో ఈ అమ్మవారి ఆలయం కూడా ఒకటై ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్నయగుంట, తహనగర్ గ్రామాల్లో బెల్టు షాపులపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో దాడి చేసినట్టు పేర్కొన్నారు. నిందితుల నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హిందీ మార్గదర్శికతో మెరుగైన ఫలితాలు



హిందీ మార్గదర్శిక మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ వి.శేఖర్, హిందీ ఫోరమ్ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా హిందీ ఫోరమ్ రూపొందించిన హిందీ మార్గదర్శిక మెటీరియల్‌తో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డీఈఓ వి.శేఖర్ తెలిపారు. ఆయన మంగళవారం విశ్వహిందీ దినోత్సవం సందర్భంగా మార్గదర్శిక మెటీరియల్‌ను ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు హిందీపై సరైన అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మార్కులతోపాటు మంచి స్కోరు, గ్రేడింగ్ సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఫోరం అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు పలువురు విషయ నిపుణులతో కలిసి మెటీరియల్‌ను రూపొందించామని తెలిపారు. వీటిని త్వరలో పీడీఎఫ్ రూపంలో హిందీ భాషోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేస్తామన్నారు. హిందీ ఫోరం తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి షాజహాన్, కార్యదర్శులు దాము, రమేష్‌యాదవ్, మహిళా కార్యదర్శి మల్లీశ్వరి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం ముద్రించిన క్యాలెండర్లను మంగళవారం బాలాజీకాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఇందులో ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వి.రవి, రాజనాల పాల్గొన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సాయికిరణ్, జె.శ్రీనివాసులురెడ్డి, నాయకులు రంజిత్‌కుమార్, ఈశ్వరయ్య, సుధాకర్, తంబయ్య, అనిత, ఉమామహేశ్వరి, సుగుణ పాల్గొన్నారు.

200 బస్తాల తమిళ బియ్యం స్వాధీనం



సూళ్లూరుపేట : రైళ్లలో అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని సూళ్లూరుపేట రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది తమిళనాడులోని పలు ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని చెన్నై-సూళ్లూరుపేట మధ్య తిరుగుతున్న సబర్బన్ రైళ్లలో తరలిస్తున్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. మంగళవారం ఆకస్మికంగా దాడులు చేసి 200 బస్తాలు సీజ్ చేశారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

మహిళను నిర్బంధించి లైంగిక దాడి

చంద్రగిరి: బ్యాంకులో రుణం ఇప్పిస్తానని చెప్పి తనను నిర్బంధించి నెల రోజుల పాటు లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది. ఆమె మంగళవారం దళిత సంఘం నేతలతో కలిసి చంద్రగిరిలో విలేకరులతో మాట్లాడింది. తాను కుమార్తెతో కలిసి తిరుపతి రూరల్ మండలంలో ఉంటూ ఒక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపింది. వెదురుకుప్పం మండలం బలిజపల్లె దళితవాడకు చెందిన నాగరాజు తరచూ మాట్లాడేవాడని పేర్కొంది. తనకు బ్యాంకులో రుణం ఇప్పించాలని కోరడంతో నవంబర్ 17న బైక్‌లో గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి గదిలో నిర్బంధించాడని తెలిపింది. పలుమార్లు లైంగిక దాడి చేశాడని పేర్కొంది. పాకాల మండలం దామలచెరువులోని బంధువుల ఇంటికి తీసుకెళ్లి అక్కడా లైంగిక దాడికి పాల్పడినట్లు వాపోయింది. తనను వదిలిపెట్టకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో తన స్వగ్రామమైన వెదురుకుప్పం మండలం బలిజపల్లె దళితవాడలో విడిచి వెళ్లాడని తెలిపింది. అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించడంతో గ్రామస్తులు అండగా నిలిచారని వెల్లడించింది. వారి సాయంతో ఈ నెల 6న తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఎస్పీ దిశ పోలీసులకు కేసును బదిలీ చేశారని వెల్లడించింది. డీఎస్పీ రామరాజు కేసు దర్యాప్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తిరుపతి అంబేడ్కర్ భవన్ చైర్మన్ జయరామ్ మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత నాయకుడు హరి తదితరులు పాల్గొన్నారు.